దయానంద్‌కు అవార్డు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి ఎస్.జాకబ్ దయానంద్‌కు అవార్డు లభించింది. విశాఖపట్నంలో జన జాతీయ గౌరవ దివాస్ మిషన్ రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రబాబు చేతుల మీదుగా ఉత్తమ క్రీడల నిర్వహణ అవార్డును ఆయనకు అందజేశారు. దయానంద్‌ను ఐటిడిఎ పిఒ కల్పనకుమారి, డిడి మంగవేణి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి అభినందించారు.

అవార్డు అందుకుంటున్న దయానంద్

పండిన చోట పండగే

- పెరిగిన ధాన్యం దిగుబడి
- ముమ్మరంగా పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది ఓవైపు కరువు పరిస్థితులు కాటేసినప్పటికీ కాస్త నీటి వసతి ఉన్నచోట ధాన్యం దిగుబడి బాగానే వచ్చింది. ఇప్పటి వరకు చేపట్టిన పంటకోత ప్రయోగాల్లో వ్యవసాయశాఖ అధికారుల ఇచ్చిన నివేదికలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

జిల్లాలో వరి అత్యంత ప్రధానమైనది. ఈ ఏడాది ఖరీఫ్‌లో అత్యధికంగా 2,31,835 ఎకరాల్లో సాగైంది. ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన పంటలకు కలిపి సాధారణ విస్తీర్ణం 4.21 లక్షల ఎకరాలు కాగా, సెప్టెంబర్ 30 నాటికి 3.53 లక్షల ఎకరాలు(84శాతం) మాత్రమే సాగయ్యాయి. ఆ తరువాత మరో 11శాతం పెరిగింది. ఈలెక్కన మొత్తం ఇప్పటి వరకు 3.90లక్షల ఎకరాలు (93శాతం) వరకు సాగైంది. ఇందులో వరి చాలా వరకు నీటి ఎద్దడితో ఇప్పటికే ఎండిపోయింది. మరికొంత ఇప్పటికీ తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటోంది. మరోవైపు పంట పండిన చోట మాత్రం పండగే అన్నట్టుగా దిగుబడి కనిపిస్తోంది. జిల్లాలో సీజన్ మొత్తానికి 2024 పంటకోత ప్రయోగాలు చేపట్టాల్సివుండగా ఇప్పటి వరకు 980 వరకు పూర్తిచేశారు. వీటిని బట్టి ఎకరాకు 75కేజీల గల 30 బస్తాలు (2,270 కేజీలు) వరకు దిగుబడి వచ్చినట్టు అంచనా వేశారు. మొత్తం పంటకోత ప్రయోగాలు పూర్తయితే ఇంతకన్నా పెరగడం లేదా తగ్గడం వంటివి కూడా ఉండవచ్చని చెబుతున్నారు. స్వల్ప తేడా మాత్రమే ఉంటే గత ఏడాది కన్నా ఈ ఎక్కువ దిగుబడి వచ్చినట్టుగా భావించవచ్చు. గత ఏడాది మొత్తం పంటకోత ప్రయోగాలు పూర్తయ్యేనాటికి ఎకరా పంట విస్తీర్ణంలో 75కేజీల గల 28 బస్తాలు (2077కేజీలు) దిగుబడి వచ్చింది. దీన్నిబట్టి గతం కన్నా ఎక్కువ దిగుబడి వచ్చినట్టుగా అర్థమౌతోంది. వాస్తవానికి గత ఏడాది వచ్చిన 28బస్తాల దిగుబడి గడిచిన పదేళ్లలో ఎప్పుడూ రాలేదని అధికారులు అప్పట్లో ప్రకటించారు.

సుమారు లక్ష ఎకరాల్లో కరువు తాండవించినట్టుగా రైతు సంఘాలు, రైతులు అంచనా వేస్తున్నారు. చాలా వరకు రంగు మారడం, అక్కడక్కడ చేను కుళ్లిపోవడం వంటి కారణాల వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. చెడిపోయిన, రంగుమారిన, మొలకొత్తిన, పురుగుతిన్న ధాన్యపు గింజలు వంటివాటితో నాణ్యతా ప్రమాణాలు తగ్గిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈనేపథ్యంలో కరువు మండలాలుగా గుర్తించడం, లేదా ఆర్థికంగా భరోసా పలకడం వంటి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం కేవలం ధాన్యం కొనుగోలు విధానాలపై మాత్రమే ముందుకు సాగుతోంది. పంటలు తీవ్రంగా ఎండిపోవడంతో పాటు నెల తేమశాతం, భూగర్భ జలాల తగ్గడం, రిమోట్ సెన్సింగ్, పశువులకు గడ్డి, దాణా దొరక్క పోవడం వంటి పరిస్థితులు ఎదురైతేనే కరువుగా గుర్తిస్తారట. జిల్లాలో ఖరీఫ్ ఈఏడాది జూన్ నుండి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతం నమోదైంది. మిగిలిన అంశాల్లోనూ కరువు నిబంధనలకు అనుగుణంగా లేవు.

అంగన్వాడీలకు అండగా ఉంటాం

రౌండ్‌టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 8 నుంచి చేపట్టే సమ్మెకు పూర్తిమద్దతిస్తామని రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు వెల్లడించారు. పార్వతీపురంలోని ఎన్‌జిఒ హోంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సరళ అధ్యక్షతన అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి మాట్లాడుతూ తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు చెల్లిస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చి విస్మరించారని విమర్శించారు. అంగన్వాడీలకు గ్రాడ్యుటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా అమలు చేయలేదన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చలేదని చెప్పారు. కేంద్రాల నిర్వహణకు అంగన్వాడీలు జీతం నుంచి పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రీ స్కూల్ పిల్లలకు, గర్భిణలకు, బాలింతలకు నాణ్యమైన సరుకులు అందివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై అనేక ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. పైగా నిర్బంధాన్ని ఉపయోగిస్తూ పోరాటాలని అణచివేసే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే డిసెంబర్ 8 నుండి రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ సెంటర్లను మూసివేసి, నిరవధిక సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు అంగన్వాడీలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. టిడిపి నాయకులు సీతారాం మాట్లాడుతూ టిడిపి హయాంలో అంగన్వాడీలకు వేతనాలు పెంచి న్యాయం చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం అంగన్వాడీల సమస్యలపై చేపడుతున్న సమ్మెకు టిడిపి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. జనసేన పార్టీ నాయకులు వంగళ దాలినాయుడు మాట్లాడుతూ అంగన్వాడీలు న్యాయమైన సమస్యలపై చేపట్టే సమ్మెకు తామంతా అండగా ఉంటామన్నారు. సిపిఎం నాయకులు గొర్లి వెంకటరమణ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీమోహన్, రైస్‌మిల్లు నాయకులు కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పడాల రాజశేఖర్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు ఎం.వెంకటరమణ, 108 నాయకులు వెంకటనాయుడు, శ్రామిక మహిళ నాయకులు వి.ఇందిర, అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.సంఘం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ సమ్మెకు మద్దతిస్తామని ప్రకటించారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి మురళీమోహనరావు

పాచిపెంట : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు టి.ప్రభావతి ఆధ్వర్యాన పాచిపెంట ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్వాడీలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రజలంతా సంఘీభావం తెలపాలని కోరారు.

పట్టాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

వైసిపి రాకుంటే పేదలకే నష్టం

గిరిజనులకు భూపట్టాల పంపిణీలో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

రానున్న ఎన్నికల్లో వైసిపిని మళ్లీ అధికారంలోకి తీసుకురాకపోతే దళితులు, గిరిజనులు నష్టపోతారని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. సోమవారం మండలంలోని దండిగాం గ్రామంలో సారిక, ములక్కాయవలస గిరిజనులకు భూపట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గొర్లి సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ గిరిజనులు, దళితులకు సమాజంలో గౌరవం దక్కాలనే లక్ష్యంతో భూమిపై హక్కు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. 20 ఏళ్లుగా డి-పట్టా భూమి సాగులో ఉన్న దళిత, గిరిజనులకు సంపూర్ణ హక్కు కల్పిస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల సాగుదారులకు ఆ భూమిపై రుణాలు పొందే అవకాశం, విక్రయించుకునే హక్కు కలుగుతాయని తెలిపారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులపై చర్చకు రావాలని అనేక సార్లు పిలిచినా టిడిపి నాయకులు మొహం చాటేశారని చెప్పారు. ఇప్పుడు సిగ్గు లేకుండా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

కొటియాపై ఆచితూచి అడుగులు

ఒడిశా ప్రభుత్వంతో నెలకొన్న కొన్ని వివాదాల కారణంగా కొటియా గ్రామాల విషయంలో ఎపి ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు రాజన్నదొర చెప్పారు. దీనిపై టిడిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కొటియా గ్రామాలలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కొటియా గ్రామాలపై ఒడిశా, ఎపి రాష్ట్రాలకు సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్ ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైసిపి సీనియర్ నాయకులు దండి, సువ్వాడ రామకృష్ణ, గొర్లి రాజారావు, పెద్దింటి మాధవరావు, మువ్వల ఆదియ్య పాల్గొన్నారు.

పట్టాల పంపిణీ తీరుపై వైస్ ఎంపిపి అసంతృప్తి

మండలంలో మొదటి విడత భూమి పట్టాల పంపిణీ తీరుపై వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను సూచించిన గ్రామాల పేర్లు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే కార్యక్రమంలో దళితులకు భూమి పంపిణీ చేయాలని ఎస్‌సి సొసైటీ అధికారులు పట్టాలతో అక్కడ ప్రత్యక్షమయ్యారు. పట్టణంలోని పెద, చిన దళితవాడలకు చెందిన దళితులు పట్టాలు పంపిణీ చేస్తారని ఆటోల్లో దండిగాం చేరుకున్నారు. ఎంపిపికి తెలియకుండా దళితులకు భూమి పంపిణీ ఎలా చేస్తారని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ ప్రశ్నించారు. తనకు కూడా ఈ విషయం చెప్పలేదని డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులందరికీ సమాచారం ఇచ్చి దళితులకు పట్టాలు పంపిణీ చేపట్టాలని రాజన్నదొర ఆదేశించడంతో దళితులు నిరాశతో వెనుదిరిగారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

అధికారులకు జెసి గోవిందరావు ఆదేశం ● 'జగనన్నకు చెబుదాం'కు 136 వినతులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుండి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టరు కేశవనాయుడుతో కలిసి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రజలు పలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 136 అర్జీలు అందజేశారు. ఆ అర్జీల్లో కొన్ని...

● గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి గ్రామానికి అంగన్వాడీ భవనం మంజూరైనా, నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల చిన్నారులు విద్యావికాసానికి దూరం అవుతున్నారని, అన్ని వసతులతో పక్కా భవనం ఏర్పాటు చేయాలని ఆ గ్రామానికి చెందిన ఎన్.సునీత దరఖాస్తు అందజేశారు. ● పార్వతీపురం మండలం సంగంవలస గ్రామంలో కూరాకుల వీధిలో మంచినీటి సమస్య అధికంగా ఉందని, కొళాయిలు రాకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నామని, కాలువల్లో చెత్త నిండిపోవడం వల్ల అనారోగ్యం బారిన పడుతున్నామని కర్రి అప్పన్న, తదితరులు వినతి అందించారు. ● గరుగుబిల్లి మండలం గదబవలస గ్రామానికి అతి సమీపంలో అత్యం స్టోన్‌క్రషర్ ఉందని, అనుమతులకు విరుద్ధంగా రాత్రి సమయంలో క్రషర్ ఆడటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామస్తులు ఫిర్యాదుచేశారు. ● గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి గ్రామంలో సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కద్రక శేషగిరి, గ్రామస్తులు దరఖాస్తు అందజేశారు.

గుమ్మలక్ష్మీపురం మండలం కొండవాడు గ్రామంలో పోడు భూములకు ప్రభుత్వం సర్వే చేపట్టిందని, వెంటనే పట్టాలు మంజూరు చేయాలని ఎం.లక్ష్మి, తదితరులు కోరారు. ● గరుగుబిల్లి మండలం చిన్నగుడబ గ్రామానికి చెందిన పి.చంద్రశేఖరరావు సర్వేనెంబర్ 233లో తన భూమిని ఆక్రమించారని, తన భూమిని తిరిగి అప్పజెప్పాలని విన్నవించారు.

కొమరాడ మండలం రామభద్రపురం గ్రామానికి చెందిన చింతాడ అమ్ముడు తన భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ● పార్వతీపురం ఐటిడిఎకు రెగ్యులర్ డీడీని నియమించాలిన గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘం నాయకులు టి.సాయిబాబు, పి.రంజిత్, బి.జనార్దన్ జెసికి వినతి అందించారు.

కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డి.భాస్కరరావు, జిల్లా సివిల్ సప్లై అధికారి శివప్రసాద్, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకటేశ్వర రావు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కె.శ్రీనివాసరావు, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా మైనారిటీ అధికారి గయాజుద్దీన్, జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ, ముఖ్య ప్రణాళికా అధికారి వీర్రాజు, జిల్లా విద్యా శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి సుధాకర్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంలో వినతి అందిస్తున్న సిఐటియు, అంగన్వాడీ యూనియన్ నాయకులు

పరిష్కారం చూపని స్పందన

జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం ద్వారా అర్జీదారులు ఇచ్చే వినతులకు ఎటువంటి పరిష్కారం దొరకడం లేదని పట్టణంలోని ఎనిమిదో వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వచ్చిన ఆయన మాట్లాడుతూ 18 నెలల నుండి పట్టణంలో పలు సమస్యలపై ఎన్నో అర్జీలు పెట్టినా ఫలితం లేదన్నారు. ప్రజలకు సమయం వృథా తప్ప ప్రయోజనం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు.

యుటిఎఫ్ వినతి

ఐటిడిఎలో పేరుకుపోయిన పలు సమస్యలకు పరిష్కారం చూపాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీ మోహన్‌రావు ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఐటిడిఎ పరిధిలోని ఉపాధ్యాయుల ప్రమోషన్లు, అక్రమ డెప్యుటేషన్లు, పండిట్ అప్‌గ్రేడేషన్లు, మెనూ తదితర విషయాలపై విన్నవించారు. భాషా వాలంటీర్ల సమస్యలపై చేపట్టే ధర్నా నోటీసును అందించారు. ఈ సందర్భంగా పిఒ స్పందిస్తూ ప్రధానోపాధ్యాయుల, ఇతర ప్రమోషన్లు రెండు రోజుల్లోగా ఇస్తామని హామీనిచ్చారు.

జీతాలు ఇప్పించండి

అంగన్వాడీలకు మూడు నెలల నుంచి జీతాలు అందక నానా అవస్థలు పడుతున్నారని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి, సిఐటియు జిల్లా నాయకులు వి.ఇందిర తెలిపారు. వెంటనే జీతాలు ఇప్పించాలని జెసి గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు. ఇదే విషయంపై ఇప్పటికే పలుమార్లు ఐసిడిఎస్ పీడీ దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనమూ లేకుండా పోయిందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు అంగన్వాడీల జీతాలను చెల్లించాలని కోరారు.

ఆ బాధ్యత ప్రభుత్వానిదే

- విద్యారంగ సమస్యల పరిష్కారంపై సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు
- నాలుగో రోజుకు ఎస్ఎఫ్ఐ దీక్షలు
- మద్దతు తెలిపిన టిడిపి, ఐద్వా, అంగన్వాడీ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం

విద్యార్థులు విద్యావంతులుగా నిలవాలంటే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, అది ప్రభుత్వ బాధ్యతని సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు స్పష్టంచేశారు. జిల్లా విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తున్న నిరసన దీక్షలు సోమవారం నాలుగో రోజుకు చేరాయి. ఈ దీక్షలకు సిపిఎం, టిడిపి, ఐద్వా, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యలను బలహీన పరుస్తున్నాయని, దాన్ని తిరగరాసే శక్తి విద్యార్థులకే ఉందని తెలిపారు. నిత్యం అద్భుతంగా పాలన చేపడుతున్నామని గొప్పలు చెబుతున్న పాలకులు.. విద్యను అందుబాటులో తీసుకురావడంలో విఫలం చెందుతున్నారని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలైనా విద్య అందని ద్రాక్షలా మారిందని వాపోయారు. జిల్లా విద్యారంగ అభివృద్ధికి ఎస్ఎఫ్ఐ చేస్తున్న డిమాండ్లు న్యాయబద్ధమైనవని, తప్పకుండా ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

టిడిపి మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు మాట్లాడుతూ చదువు విద్యార్థి హక్కని, దాన్ని కల్పించడం ప్రభుత్వం బాధ్యతని స్పష్టంచేశారు. కానీ అటువంటిది రాష్ట్రంలో కరువైందని, భవిష్యత్తు విద్యార్థి పోరాటాలకు టిడిపి పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి, ఐద్వా నాయకులు వి.ఇందిర, ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులు సిహెచ్ ముఖేష్ దీక్షలకు మద్దతు ప్రకటించారు. విద్యార్థుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. దీక్షల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు కె.,రాజు, నాయకులు శివ, గౌరీష్, ముఖేష్, ప్రదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

విద్యాశాఖ కాదు.. ఉపాధ్యాయులను వేధించే శాఖ

యుటిఎఫ్

ప్రజాశక్తి-పార్వతీపురం

ఉపాధ్యాయులను వేధించే శాఖగా విద్యాశాఖ పేరును మార్చుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు సూచించారు. సోమవారం పార్వతీపురంలో నిర్వహించిన యుటిఎఫ్ ఆఫీస్ బేరర్ల సమావేశంలో వారు మాట్లాడారు. నాణ్యమైన విద్యకోసం పర్యవేక్షణ పేరుతో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ ఉపాధ్యాయులను వేధిస్తున్నారని చెప్పారు. శాస్త్రీయమైన పర్యవేక్షణ లేకుండా ఉపాధ్యాయులపై పనిభారాన్ని పెంచుతూ, విద్యార్థుల తప్పులను కూడా టీచర్లకు ఆపాదిస్తూ చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. ఉపాధ్యాయులను తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురిచేయడం వల్ల విద్యార్థులు నష్టపోతారని తెలిపారు. ఉపాధ్యాయులను స్వేచ్ఛగా పాఠాలు చెప్పుకోనివ్వాలని కోరారు. ప్రవీణ్ ప్రకాశ్ వైఖరిపై జగన్ మౌనం వహించడమంటే, ముఖ్యమంత్రికి తెలిసే ఇలా వేధిస్తున్నారని అనుకోవాల్సి వస్తుందన్నారు. ప్రవీణ్ ప్రకాశ్ వైఖరిపై పెద్దఎత్తున ఉపాధ్యాయులంతా కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎన్.శ్రీను, పి.వెంకటనాయుడు, కె.కృష్ణారావు, గోవిందమ్మ, కూర్మారావు పాల్గొన్నారు.

ముగిసిన ఆర్చరీ పోటీలు

విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన జాయింట్ కలెక్టర్, డిఇఒ

ప్రజాశక్తి-సీతానగరం

సీతానగరం మండలంలోని జోగంపేట గురుకులంలో మూడు రోజుల పాటు నిర్వహించిన అండర్-14, 17, 19 బాలబాలికల రాష్ట్ర స్థాయి 67వ ఆర్చరీ పోటీలు సోమవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు మాట్లాడారు. క్రీడలు వల్ల యువతలో మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటుందని తెలిపారు. క్రీడలలో విజేతలకు, పాల్గొన్నవారికి ఇచ్చే ప్రశంసాపత్రాలు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. గెలుపుకంటే పాల్గొనడం ముఖ్యమని ప్రతీ క్రీడాకారుడు గుర్తించాలని తెలిపారు. ఆర్చరీ క్రీడలు విజయవంతంగా నిర్వహించిన క్రీడా సిబ్బందికి, మండల, జిల్లా విద్యాశాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. డిసెంబర్ 15 నుండి 50 రోజుల పాటు ఆడుదాం ఆంధ్రా క్రీడలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారు త్వరలో గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. పోటీలకు 13 జిల్లాల నుండి 600మంది క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు సూరిదేముడు, వెంకటరమణ, కర్రి ప్రసాదరావు, ప్రిన్సిపల్ ఈశ్వరరావు, ప్రతిభ కళాశాల ప్రిన్సిపల్ పోల వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు, డిఇఒ ప్రేమ్‌కుమార్

ఆడుదాం ఆంధ్రా రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సోమవారం నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభమైందని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల మస్కట్ (లోగో) పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 15వ తేదీ నుండి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలు వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 3వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 13వ తేదీ వరకు రిజిస్ట్రేషను ప్రక్రియ సాగుతుందన్నారు. జిల్లాకు చెందిన 15 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులు అందరూ అర్హులేనని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రిజిస్ట్రేషన్లు సమీప గ్రామ వార్డు సచివాలయం, వాలంటీర్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1902, https://aadudamandhra.ap.gov.in ద్వారా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలలో గెలుపొందిన వారికి నియోజకవర్గ స్థాయిలో రూ.35 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులుగా అందిస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా స్థాయిలో రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు., రాష్ట్ర స్థాయిలో రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షలు బహుమతులుగా అందిస్తారని వివరించారు. బాడ్మింటన్ పోటీలలో గెలుపొందిన వారికి నియోజకవర్గ స్థాయిలో రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులుగా అందిస్తారని తెలిపారు. జిల్లా స్థాయిలో రూ.35 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు., రాష్ట్ర స్థాయిలో రూ.2 లక్షలు, రూ.లక్ష, రూ.50 వేలు బహుమతులుగా అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి జి.కేశవనాయుడు, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి.మంజుల వీణ, క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వర రావు, ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్టు అధికారి డి.భాస్కరరావు, డిపిఒ బి.సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా లోగోను ఆవిష్కరిస్తున్న జెసి గోవిందరావు, ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్, అధికారులు

బ్యాంకు పుస్తకాలు చూపిస్తున్న గిరిజనులు

బ్యాంకు ఖాతాల్లో నగదు మాయం!

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని బీరుపాడు పంచాయతీ శ్రీరంగపాడు గ్రామంలో వివిధ ప్రభుత్వ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల ఖాతాలో నుంచి నగదు మాయమైంది. దీంతో కిల్లక రామదాసు, నిమ్మక ఎల్లమ్మ, కొండగొర్రి అప్పలమ్మ తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో 20 మందికి పైగా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10 వేలు ఉన్నచోట రూ.500, రూ.5 వేలు ఉన్న ఖాతాల్లో రూ.500 చూపించడంతో తమ పిల్లలకు విషయాన్ని తెలిపారు. 100కు డయల్ చేసి సమాచారం ఇచ్చామని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఇదే విషయాన్ని ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు వద్ద ప్రస్తావించగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతానగరం

సీతానగరంలో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.20 లక్షలతో సిసి రోడ్లు, డ్రెయిన్ల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి, పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. అనంతరం క్రిస్మస్ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బి.శ్రీరాములునాయుడు, జెడ్‌పిటిసి బాబ్జీ, సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, వైసిపి నాయకులు దాసరి నాగరత్నం, ఆర్‌వి పార్థసారధి, పి.సతీష్, సాకేటి కూర్మారావు, రమేష్, యు.సురేష్, శ్రీనివాసరావు, వై.రాధాకృష్ణ, బలగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి, పరీక్షిత్ రాజ్

బస్సుయాత్ర సభాస్థలి పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో ఈ నెల 29న జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర సభా స్థలాన్ని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు స్థానిక నాయకులతో మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా పనులు పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో ఊటగూడ గ్రామంలో సోమవారం సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ సభ్యులు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. భూమిలేని ఆదివాసీలకు ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇవ్వాలని, విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు పి.భాస్కరరావు, సహదేవుడు, కె. మహేష్, ధర్మారావు, మురళి, నిమ్మక దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని జనసేన నాయకులు ఎం.పుండరీకం, జానీ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరుణుడు కరుణించకపోవడంతో వంకాయలగడ్డ, పెద్దూరు, హుస్సేన్‌పురం, నీలంపేట, గడబవలస తదితర గ్రామాల్లో వరి పంట పూర్తిగా నాశనం అయిందని తెలిపారు. వెంటనే పంటనష్టాన్ని అంచనా వేసి, రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు.

అసంబద్ధ తనిఖీలతో తీవ్ర నష్టం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యారంగంలో ప్రస్తుతం జరుగుతున్న తనిఖీలు విద్యా వ్యవస్థను చక్కదిద్దే విధంగా కాకుండా ఉపాధ్యాయ వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేసేలా ఉండడం సమంజసం కాదని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. సోమవారం మున్సిపల్ స్కూల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులను దోషులుగా చూపడం భావ్యం కాదని అన్నారు. తనిఖీలు విద్యారంగాన్ని బలోపేతం చేసేవిధంగా ఉండాలి తప్ప, చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ఉండకూడదన్నారు. ఒక పాఠశాలలో 100 మంది విద్యార్థులు ఉంటే 90 మంది టాలెంట్ ప్రదర్శించినా కేవలం 10 మంది విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయులను వేధించడం సమాజానికి శ్రేయస్సు కాదని అన్నారు. పట్టణ ప్రాంత విద్యార్థులు కన్నా గ్రామీణ ప్రాంత విద్యార్థులు సామర్థ్యాల విషయంలో కొంత వెనుకబడి ఉంటారని అన్నారు. సమావేశంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు వలిరెడ్డి రవీంద్ర నాయుడు, డి.శ్రీనివాస్, బంకపల్లి శివ ప్రసాద్ చిట్టి రాము నాయుడు, రెడ్డి గణపతి, చలుమూరి రమేష్, రెడ్డి భాస్కర్, రంది శ్రీను, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజ ప్రగతి

విజయనగరం కోట : విద్యతోనే సమాజ ప్రగతి సాధించవచ్చునని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. సోమవారం గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో శ్రీనివాస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 133వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు ముందుగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఆర్‌బి రామానాయుడు పూలే వేషధారణలో పిల్లలకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. అనంతరం నారాయణరావు మాట్లాడుతూ పాఠశాల స్థాపించి స్త్రీ విద్యపై కృషి చేసిన మహనీయుడు పూలే అన్నారు. స్త్రీ విద్యతోనే సమాజం అభివృద్ధి చెంది ముందుకు పయనిస్తుందని తెలిపారు.

కంది పప్పు పంపిణీ చేయాలి

బొబ్బిలి : పట్టణంలోని తెల్ల రేషన్ కార్డుదారులకు కంది పప్పు పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ డిమాండ్ చేశారు. తెల్ల రేషన్ కార్డుదారులకు కంది పప్పు ప్రభుత్వం పంపిణీ చేసినప్పటికీ ఎక్కడా లబ్ధిదారులకు ఇవ్వడం లేదన్నారు. బహిరంగ మార్కెట్లో కంది పప్పు కిలో రూ.200 వరకు ఉండడంతో కొంతమంది డిఎంయు ఆపరేటర్లు కంది పప్పును అమ్మేసినట్లు దామోదర్ ఆరోపించారు.

30న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-సాలూరు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30న నిర్వహించనున్న చలో కలెక్టరేట్‌ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.పండు కోరారు. సోమవారం బంగారమ్మపేటలోని పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా ఏర్పడి ఏడాదిన్నర దాటినా విద్య, ఉపాధి అవకాశాలు లేవన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తున్నదని చెప్పారు. ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. దీనిపై ఈ నెల 24 నుంచి 29వరకు నిరసన దీక్షలు చేపడుతున్నామని తెలిపారు. ఈ నెల 30న చలో కలెక్టరేట్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిల్, నాని పాల్గొన్నారు.

రోల్ అబ్జర్వర్ పర్యటన వాయిదా

పార్వతీపురం : ఎన్నికల రోల్ అబ్జర్వర్ జె.శ్యామలరావు జిల్లా పర్యటన వాయిదా పడిందని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా పర్యటన వివరాలు అందిన వెంటనే తెలియజేస్తామని ఆయన చెప్పారు.

సమస్యలు పరిష్కరించండి


అధికారులకు సమస్యను విన్నవిస్తున్న గిరిజనుడు

ఐటిడిఎ స్పందనకు గిరిజనుల వినతులు

ప్రజాశక్తి-సీతంపేట

తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు వినతులు సమర్పించారు. సోమవారం స్పందన కార్యక్రమాన్ని ఐటిడిఎలో పిఒ కల్పనకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎం.సింగపురం గ్రామానికి చెందిన అప్పనదొర మేకల లోను ఇప్పించాలని విన్నవించారు. మర్రిగూడకు చెందిన శాంతి కుమారి ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కోరారు. గ్రూప్-2 కోచింగ్ పెంచాలని విజ్ఞప్తిచేశారు. గంగంపేటకు చెందిన బాసమ్మ వ్యవసాయ బోరు మంజూరు చేయాలని కోరారు. కరిగాం గ్రామానికి చెందిన రమేష్ వైటిసి ఉద్యోగులు జీతాలు ఇప్పించాలని విన్నవించారు. గొట్టిపల్లికి చెందిన నగేష్ ఆర్ఒఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని కోరారు. పదనాపురం గ్రామానికి చెందిన కామేశ్వరరావు బిటి రోడ్డు మంజూరు చేయాలని అర్జీ అందించారు. తుంబలిగూడకు చెందిన కాంతమ్మ కిరాణా షాపు లోన్ ఇప్పించాలని పిఒ దృష్టికి తీసుకొచ్చారు. ఈ స్పందన కార్యక్రమంలో ఎపిఒ రోషిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.సింహాచలం, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, సిడిపిఒ పి.రంగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న పిఒ కల్పనకుమారి, ఐటిడిఎ అధికారులు

సత్తాచాటిన గిరిజన విద్యార్థులు

ప్రజాశక్తి-సీతంపేట

జన జాతీయ గౌరవ దివస్ సందర్భంగా రాష్ట్ర గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో సీతంపేట ఐటిడిఎ విద్యార్థులు సత్తాచాటారు. విశాఖపట్నంలో జరిగిన ఈ క్రీడాపోటీల్లో బాలికల ఆర్చరీ, వాలీబాల్‌లో ప్రథమ స్థానం, బాలుర ఆర్చరీ, జావెలిన్ త్రోలో తృతీయ స్థానాలు సాధించారు. పెయింటింగ్‌లో ప్రథమ స్థానం, వక్తృత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు, వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. దాంతోపాటు రాష్ట్ర స్థాయి ఆల్‌రౌండ్ ఛాంపియన్‌షిప్‌ను సీతంపేట ఐటిడిఎ గెలుచుకొంది. ఈ సందర్భంగా క్రీడాకారులను ఐటిడిఎ పిఒ కల్పనకుమారి సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. క్రీడలను మరింతగా ప్రోత్సహించేలా చర్యలు తీసుకొంటామన్నారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మంగవేణి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, ఎఎంఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, సిఎంఒ చిరంజీవులు, తదితరులు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, వైసిపి నాయకులు

శంకుస్థాపనతో వదిలేయడం టిడిపికే అలవాటు

మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ

ప్రజాశక్తి-సాలూరు

నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసి వదిలేయడం టిడిపికే చెల్లిందని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైసిపి ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్‌రావు అన్నారు. సోమవారం వారు టిడ్కో గృహ సముదాయం ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో టిడిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులపై చర్చకు రావాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర అనేక సార్లు సవాల్ విసిరారని చెప్పారు. దానిపై టిడిపి నాయకులు ఏనాడూ స్పందించలేదని తెలిపారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం ప్రారంభించింది టిడిపి హయాంలోనేనని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించకుండా వారిని అప్పులపాలు చేశారని చెప్పారు. చంద్రబాబు నిర్వాకం వల్ల ఇళ్ళలో దిగకుండానే లబ్దిదారులు రుణాలు వాయిదాల రూపంలో చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా రూపాయికే టిడ్కో ఇళ్ళ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్నదని చెప్పారు. పేదలను నమ్మించి మోసం చేయడం సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి చేతకాదన్నారు. పట్టణంలో వంద పడకల ఆసుపత్రికి టిడిపి ప్రభుత్వం శంకుస్థాపన చేసి వదిలేస్తే తమ ప్రభుత్వం శరవేగంగా నిర్మిస్తోందని చెప్పారు. నియోజకవరంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర హయాంలో జరిగిన అభివృద్ధి పనులు రోడ్లు, వంతెనల రూపంలో కనిపిస్తున్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల చేయడం వల్లనే రాజన్నదొరను వరుసగా మూడు సార్లు ప్రజలు గెలిపించారని చెప్పారు. వాస్తవాలు తెలుసుకుని టిడిపి నాయకులు ఆరోపణలు చేయాలని హితవుపలికారు. సమావేశంలో కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, గుల్లిపల్లి నాగేశ్వరరావు, వైసిపి నాయకులు పున్నాన మోహనరావు, పిరిడి రామకృష్ణ, హరిబాలాజి, గిరి చిన్ని, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్‌సిలో డిఐఒ తనిఖీలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పోషకాహార పునరావాస కేంద్రం(ఎన్ఆర్‌సి)లో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. జిల్లా ఆసుపత్రిలో ఉన్న ఎన్ఆర్‌సిలో వివిధ ప్రాంతాల నుండి చేరిన ఐదేళ్లలోపు పిల్లలు, వారి ఆరోగ్య వివరాల రికార్డులను పరిశీలించారు. పిల్లల బరువు స్వయంగా ఆయన తనిఖీ చేశారు. ఎదుగుదల లోపం, రక్తహీనత, పోషకాహార లోపం ఇంకా ఏ విధమైన ఆరోగ్య సమస్యలున్నాయా? అని పరిశీలించారు. గతంలో అడ్మిట్ అయిన పిల్లలకు ఆరోగ్యం ఏ మేరకు వృద్ధి చెందిందో పరిశీలించారు. పిల్లలను తరచూ పర్యవేక్షణ చేయాలని సిబ్బందికి సూచించారు. అక్కడున్న తల్లిదండ్రులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందజేస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో బరువు, ఎదుగుదల తక్కువగా గుర్తించిన పిల్లలను పూర్తి ఆరోగ్య వివరాలతో ఎన్ఆర్‌సి కేంద్రాల్లో చేర్చాలని సూచించారు. అక్కడ వారిని పది రోజుల నుండి రెండు వారాల వరకు ఉంచి వైద్యులు, వైద్య సిబ్బంది పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ప్రతిరోజూ పోషకాహారం ఏడు లేదా ఎనిమిది దశల్లో అందిస్తారన్నారు. జిల్లాలో రెండు ఎన్ఆర్‌సిలున్నాయని, వేరొకటి సీతంపేట, ప్రాంతీయ ఆసుపత్రిలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, న్యూ ట్రిషన్ కౌన్సిలర్ జ్యోతి, సిబ్బంది ఉన్నారు.

బాలుడి బరువు చూస్తున్న డిఐఒ జగన్మోహనరావు

సీతానగరం ఎస్ఐగా రాజేష్

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా రాజేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ కె.నీలకంఠం కొమరాడ బదిలీపై వెళ్లారు. గరుగుబిల్లి స్టేషన్ నుంచి రాజేష్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలను కాపాడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తీయాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపాలిటీ పరిధిలో మురుగు కాలువల్లోని పూడిక తీయాలని జనసేన పార్టీ నాయకులు వంగల దాలినాయుడు.. జగనన్నకు చెబుదాంలో జెసి ఆర్.గోవిందరావుకు వినతి అందించారు. కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో దుర్గంధంతోపాటు రోగాలు వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

ప్రతీ పిఎస్‌లో ఓటర్ల జాబితా ఉంచాలి

జిల్లా పరిశీలకులు జె.శ్యామలరావు


సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా పరిశీలకులు శ్యామలరావు

ప్రజాశక్తి-విజయనగరం, భోగాపురం

ఓటర్ల జాబితాలను ప్రతీ పోలింగ్ స్టేషన్లోనూ ఉంచాలని, జిల్లా పరిశీలకులు, రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు ఆదేశించారు. సోమవారం జిల్లాలో పర్యటించారు. భోగాపురం మండలం రాజాపులోవలోని 196, 197 పోలింగ్ కేంద్రాలను, విజయనగరం విటి అగ్రహారంలోని 58-63 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బిఎల్ఒలతో మాట్లాడి ఫారం 6,7,8పై ఆరా తీశారు. ఓట్ల చేర్పింపు, తొలగింపు ప్రక్రియపై ఇళ్లకు వెళ్లి విచారణ చేస్తున్నారా? లేదా? అని ప్రశ్నించారు. ఫారమ్ 6,7,8 దరఖాస్తులను పరిశీలించారు. కొత్త ఓటర్లపై ఆరా తీశారు. 18 ఏళ్లు నిండినవారిందరికీ ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు. ఓట్ల తొలగింపు ప్రక్రియపై ప్రశ్నించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం వాటిని వెంటవెంటనే ఆన్‌లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ఇఆర్ఒ నూకరాజు, తాహశీల్దార్లు బంగార్రాజు, కోరాడ శ్రీనివాసరావు, డిప్యూటీ తాహశీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంపై దృష్టి పెట్టాలి

జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై జిల్లా పరిశీలకులు జె.శ్యామలరావు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా జిల్లాలో యువ ఓటర్లపై దృష్టిపెట్టి, అధిక సంఖ్యలో చేర్పించడం పట్ల ఆయన జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో భేటీ అయి, వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ఓటర్ల ఓటర్ల నమోదుపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డుపై సంతకాలు చేశారు.

జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పురోగతిని కలెక్టర్ నాగలక్ష్మి ముందుగా వివరించారు. అనంతరం జాబితా పరిశీలకులు శ్యామలరావు మాట్లాడుతూ, జిల్లాలో 18, 19 ఏళ్ల వయసు గల యువ ఓటర్లను అధిక సంఖ్యలో చేర్పించడం అభినందనీయమని అన్నారు. అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని ఆదేశించారు. జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన తదతర పథకాల లబ్దిదారుల జాబితాలను పరిశీలించి, 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు. శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా నమోదు కార్యక్రమంపై దృష్టి పెట్టి, దీనికి విస్తత ప్రచారం నిర్వహించా లని చెప్పారు. అన్ని రకాల ఫారాలను పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో ఖచ్చితమైన ఓటర్ల జాబితాను అత్యంత పారదర్శకంగా జాబితాలను తయారు చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశాల్లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, వివిధ నియోజకవర్గాల ఇఆర్ఒలు, ఆర్‌డిఒలు, తాహశీల్దార్లు, డిటిలు పాల్గొన్నారు.

బంగారు గొలుసు అపహరణ

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

పట్టణంలో సోమవారం మహిళ మెడలో పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తి అపహరించినట్లు సిఐ కృష్ణారావు తెలిపారు. సిఐ కథనం ప్రకారం.. బెలగాంలో జనశక్తి కాలనీకి చెందిన కోణాల వరలక్ష్మి సోమవారం ఉదయం 5 గంటలకు చెత్త పారబోసేందుకు ఇంటి బయటకు వచ్చారు. గుర్తు తెలియని వ్యక్తి మాస్క్ వేసుకుని ఆమె మెడలో బంగారు గొలుసును తెంచి, పరారయ్యాడు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

వరుస చైన్ స్నాచింగ్‌లతో మహిళలు బేజారు

జిల్లా కేంద్రం పార్వతీపురంలో వరుస చైన్ స్నాచింగ్ ఘటనలతో మహిళలు భయాందోళన చెందుతున్నారు. వైకెఎం కాలనీ, బైపాస్ కాలనీ, ఎస్ఎన్ఎం నగర్, సౌందర్య థియేటర్ వెనుక రోడ్డు, పట్టణంలో ఉన్న సంకా వీధి ప్రాంతాల్లో ఒంటరి మహిళల మెడలో ఉన్న బంగారు గొలుసులే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా జనశక్తికాలనీలో ఇంటి బయటే మహిళ మెడలో పుస్తెలతాడును అపహరించుకు పోయారు. దీంతో పట్టణ మహిళలు ఒంటరిగా రోడ్డు మీదకు రావాలంటే భయపడుతున్నారు. చైన్‌స్నాచింగ్ ఘటనలపై పోలీసులు దృష్టిపెట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

PARVATHIPURAM MUNICIPALITY
e.PROCUREMENT TENDER NOTICE

S.No.	NIT No.	No. of works	Total Estimate Amount
1	Tender No.10/2023-24 (15th FC Grant)	3 Works	Rs.24.08 Lakhs
	Total	3 Works	Rs.24.08 Lakhs

For further details visit : For all details visit site www.apeprocurement.gov.in

Sd/- J. Rama Appalanaidu
Commissioner
Parvathipuram Municipality